# గోరియా

ఆఫీసు పనిమీద హైదరాబాద్ వెళ్లాలంటే అదో థ్రిల్లు.... వేరే చోటికి వెళ్లాలంటే ఉత్సాహం నిల్లు....ఫ్... అనుకోకుండా నిజామాబాద్ వెళ్లాల్సివచ్చింది.

పొద్దంతా ఫైళ్ల మధ్య నలగడంతో నీరసం ఆవహించి సాయంత్రం ఇంటికి రాగానే చాయ గ్లాసుతో ఎదురొస్తున్న అర్ధాంగి ముందు గోడు వెళ్లబోసుకున్నాడు.

అర్ధాంగి ముఖారవిందం అమాంతం వికసించింది..

"అదేమిటండీ.... తాహరన్నయ్య వాళ్లుండేది నిజామాబాద్‌లోనే కదా"... ఆత్మీయ మిత్రుడిని గుర్తు చేసింది. వేడిచాయ్... తాహర్ బాపతు జ్ఞాపకాలు.. నరాలు కొత్త స్వరాలు వినిపించినై.

నిజమే... కలిసొచ్చే కాలానికి నడిచొచ్చే కొడుకు పుడతాడన్నట్లు – రేపు శనివారం మధ్యాహ్నం లోగా నిజామాబాద్ చేరి ఆఫీసు పని ముగించుకుని ఆత్మీయ మిత్రునింటి కెళ్ళొచ్చు. ఆదివారం హాయిగా గడపొచ్చు. జ్ఞాపకాలను, వ్యాపకాలను నెమరేసుకోవచ్చు.

మూణ్ణాళ్ల ముచ్చటైన జీవితాన్ని మురిపాలతో గడపాలనుకునే తాహర్, నేను ఫ్యామిలీ ఫ్రెండ్సము. ఒకే ఊళ్లో, ఒకే ఆఫీసులో పదేళ్లు కలిసి పనిచేశాము. మనుషుల మధ్య మాయపొరల్లా పేరుకుపోయిన కులమతాలు కుత్సితాలను ప్రోత్సహించే కుంటిసాకులని మా ఇద్దరి విశ్వాసం. అదే అభిప్రాయం స్నేహ మాధుర్యాన్ని రుచి చూపించింది. ఆధునిక వ్యాపార యుగంలో మనుషుల్ని దోచేసే స్నేహితులెందరో వున్నారు. కానీ... మనసుల్ని దోచే కొందరిలో తాహర్ ఒకడు.

అనుకున్నట్లుగా శనివారం ఆఫీసుపని పూర్తికాగానే... నాలోని మిత్రోత్సాహం రెక్కలు విప్పుకుని తాహర్ ఇంటికి చేర్చింది. గేటుకు రెండుపక్కలా కాపలాదార్లలా నిల్చున్న కొబ్బరి చెట్లు, పచ్చని కొబ్బరి ఆకుల మాటున పడమటి ఆకాశం సింధూరవర్ణం కొంగు సవరించుకుంటోంది. చల్లగాలి ఇంటికి గిలిగింతలు పెడుతోంది.

నిజామాబాద్ చేరగానే ఫోన్‌లో పలకరించాను కాబట్టి తాహర్ దంపతులు నా కోసమే ఎదురుచూస్తున్నారేమో... చిరునవ్వులతో ఎదురొచ్చి స్వాగతం చెప్పారు.

"వదినా... పిల్లలు బాగున్నారా అన్నయ్యా.." శ్రీమతి తాహర్.

అక్కా చెల్లెళ్ల ఆత్మీయతను ఆమె ద్వారానే అర్థం చేసుకున్న నా అంతరంగం స్వాతిచినుకు అందుకున్న చకోర పక్షిలా పులకించింది.

"పైవాడి దయ వల్ల అంతా బాగున్నారమ్మా..." గొంతు గద్గదమైంది.

"పనిలో పని మా చెల్లెమ్మను కూడా తీసుకొస్తే బాగుండేది గదరా..." అంటూ తాహర్ నా చేతిలోంచి బ్రీఫ్‌కేస్ తీసుకున్నాడు.

"పిల్లల పరీక్షలు దగ్గరకొస్తున్నాయ్ కదరా.."

మనసు స్పర్శించే మాటల ఫలితమేమో – రాత్రి భోజనం చాలా రుచికరంగా తయారైంది. భోజనం పూర్తయ్యాక లాన్‌లో కుర్చీలు వేసుకుని – నిర్మలాకాశంలో నిరాఘాటంగా పయనిస్తున్న చందమామను చూస్తూ – బాతాకానీకి దిగాం.

నాటి నుండి నేటి దాకా పెద్దాఫీసర్ల వ్యవహారం, అమెరికా గ్లోబల్ గూండాయిజం నుండి అటల్‌బిహారీ వాజ్‌పేయి పరిపాలనా చాతుర్యం దాకా స్వేచ్ఛగా మాట్లాడుకున్నాం.

ఆదివారం ఉదయం కబుర్లతో పాటు కొబ్బరి చెట్నీతో ఇడ్లీలు లాగించాం. తిరిగి వెళ్తానని మాటవరస కన్నాను.

"అదేమిట్రా... అప్పుడే మొహం మొత్తిందా?" తాహర్ వ్యంగ్యబాణం.

తాహెర్‌కు ఇద్దరు పిల్లలు, వాళ్లతో సరదాగా బజారుకెళ్లి స్వీట్లు కొనిచ్చి తిరిగొస్తున్నాను. నిజామాబాద్ రోడ్లు నిజమైన సిటీ వాతావరణాన్ని సంతరించుకున్నాయి.

"బాగున్నావా... సారూ?..." నా ముందు నుంచున్నాడో వ్యక్తి. ఎగాదిగా చూస్తున్నానతణ్ణి... దోరమాగిన నిమ్మపండు దేహఛాయ, మోకాళ్లదాకా ధోవతి... మాఊరి మనిషిలా వున్నాడు.

"... నువ్వు గోరెమియావు గదా.." ఠపీన అడిగేశాను.

"హమ్మ.. గుర్తుబట్టిండు.." గుండెమీద చెయ్యేసుకుని గట్టిగా ఊపిరి పీల్చుకున్నాడు. ఎన్నేళ్లయింది నిన్ను చూసి... పిల్లలెందరు... అంటూ నా చేతులు పట్టుకున్న పిల్లల్ని చూస్తున్నాడు.

"వీళ్లు నా ఫ్రెండు పిల్లలు.." అంటూ నా విషయాలు చెప్పేశాను. "మా ఫ్రెండు ఇల్లు దగ్గరే వుంది పోదాం పద.." తాహర్ ఇంటికి తీసుకెళ్తున్నాను.

ఎక్కడి గోరేమియా.. ఎలాగైపోయిండు.. సిద్ధిపేట - మెదక్ రహదారి మీదున్న మా ఊళ్లో కరీంసాబుదో పేద కుటుంబం. కరువుకాటకాలతో నోళ్లు తెరిచిన బీడు పొలాలు, తాగు సాగునీటి లేమి, పశుగ్రాసం లేక రుద్రారం పశువధశాలకు ఆవుదూడల తరలింపులు... మరెన్నో నిత్య సమస్యలనెదిరించలేక జీవన పోరాటంలో ఆశల ఆరాటాన్ని అదుపు చేసుకుంటున్న తెలంగాణా గ్రామసీమల్లో మా ఊరొకటి... శాపగ్రస్తమైంది.

ఓరోజు... కరీంసాబు భార్యతో సహా ఊరవతలికెళ్లాడు. రెండు మైళ్లు నడిచి చెరో కావడిలో నీళ్లు తెస్తుంటే నడిరోడ్డుమీద పట్టపగలు గుర్తుతెలియని లారీ గుద్దేసి వెళ్లిపోయింది. గోరేమియా అనాథైపోయాడు. రక్తం మడుగులో శవాలైపడున్న తల్లిదండ్రులమీద పడి హృదయవిదారకంగా ఏడుస్తున్న గోరేమియాను చూస్తుంటే అందరి గుండెలవిసిపోయినై. అప్పటికే ఇద్దరు పిల్లలున్న వడ్రంగి యాదగిరి చేరదీశాడు. బడికి పంపాడు.

బడిలో చదువు సరిగా అబ్బలేదు గాని ఇంటి ఒడిలో వడ్రంగి పని ఒంటబట్టింది. గోరేమియా యుక్త వయస్సు రాగానే కన్నతండ్రి నుండి సంక్రమించిన కుష్టువ్యాధి తన ఉనికి తెలుపుకుంది. వయసుతో పాటు వ్యాధి కూడా పెరుగుతూ చిల్లరమొల్లర వైద్యానికి లొంగనంది. శరీరమ్మీద గోగుపూలలాంటి పుండ్లు పూయించింది.

ఉడికించే ఎండలు, ఊరడించలేని వర్షాల్లాగా - తిండికే కటకటలాడుతున్న యాదగిరి కుటుంబాన్ని కుంగదీసంది. ఓరోజు.. యాదగిరి భార్య గుండెలు బాదుకుంటూ గొడవకు దిగింది.. "జెర గా గొరేమియాను జూడు.. చెయ్యంతా పుచ్చిపోయింది. వాడు ఇంట్లనే ఉంటే ఈ పెద్దరోగము నా పిల్లలకంటుకుంటది.." అంటూ భర్తను నిలదీసింది.

"పాపం.. తల్లిదండ్రులు లేని పోరడు.."

సముదాయించినా ఆమె వినలేదు. "అదంతా నాకు తెల్వదు... ఆ పోరడు ఇంట్లనే ఉంటే నేనూ నా పిల్లలు ఎటన్న పోతం..." తెగేసి చెప్పింది.

అమాయక హృదయం ఎంత కల్లోలమైందో... తెల్లారేసరికి గోరేమియా మాయమైపోయాడు. తర్వాత ఇప్పుడే కనబడ్డం. తాహెర్ ఇంట్లో ఎదురెదురుగా కూచున్నాము. నా కళ్లు గోరేమియా ఒంటిని శోధిస్తున్నాయి. అనాటి పుండ్లు లేవు, శుభ్రంగా ఉంది. అతణ్ణి తాహెర్‌కు పరిచయం చేశాను. తాహెర్ వింత చూపులతణ్ణి ఆపాదమస్తకం పరిశీలిస్తుంటే శ్రీమతి తాహెర్ ఇడ్లీ ప్లేటు తెచ్చి ముందుంచింది.

గోరేమియా కళ్లు చమక్కుమన్నాయి. "గిదేంది సార్...?"

"తిను అన్నా..." ప్లేటు చేతికందించాడు తాహెర్.

"తీసుకో గోరేమియా..." నా కళ్లలో చిరునవ్వులు. వాటిని ఏరుకుంటూ గోరేమియా తినడం ప్రారంభించాడు. తాహెర్ అతని పక్కన కూచుని" మేము దగ్గరి దోస్తులం. నువ్వు కూడా దోస్తువైన వన్నా."
మందహాసం చేశాడు. ఇడ్లీలతో పాటు గోరేమియా కళ్లలోని కల్లోలం కూడా తరిగిపోయింది.

తాహెర్ మాటలు తేనెతేటల్లాగున్నయ్. "మరీ.. నీ పేరు గోరేమియా కదా.." అంటూ తాహెర్ ఇంకేదో చెప్పబోయాడు.

నుదురుతోపాటు పెదాలను విచిత్రంగా కదిలిస్తూ... "ఇప్పుడు నా పేరు గోరియా సార్.." స్థిరంగా అన్నాడతను.

మేము మొహాలు చూసుకున్నాం.

"సార్. మీరు ఓసారి మా ఇంటికొస్తే మాకు ఖుషీగుంటది..." గురువుల ముందు శిష్యుడిలా చేతులు జోడించాడు.

ఇప్పుడేం చేయాలి... రామంటే అతనిలో ఇన్ఫిరియారిటీ కాంప్లెక్స్ బలపడిపోతుంది. మమ్మల్ని అందరాని, అంటరాని గర్వపోతులుగా భావిస్తాడు. సైగల భాషలో కళ్ళతో మాట్లాడుకుంటున్నాం.

"మా లంబాడి తండా ఇక్కడికి దగ్గర్నే.." వివరాలన్నీ చెప్పాడు. కాదనడానికి వీల్లేని పరిస్థితి అది. గోరేమియా గొరియా ఎలాగయ్యాడు? మాక్కూడా తెలుసుకోవాలనుంది.

"సరే గొరియా..." "నువ్వెళ్లన్నా. మేము నా బండిమీదొస్తాము. పన్నెండు కల్లా మీ తండా చేరుకుంటాము..." నా మనసులోని మాట తాహెర్ నోటంట వెలువడింది.

ఇద్దరు ముగ్గురు పాత మిత్రుల్ని కలుసుకుని సరదాగా మాటలాడి తృప్తిగా బయలుదేరాం. తార్రోడ్డు మీద హీరో హొండా... హీరోహొండా మీద ఇద్దరు హీరోలం. పన్నెండుకల్లా తండా చేరుకున్నాం.

ఓ పెంకుటిల్లు ముందు బండి ఆపి, "గొరియా ఇల్లెక్కడ?" అడిగాం. గులాబిరంగు చీరలో ఒకామె-"రండ్రి... రండ్రి.. ఇదే..." అని బుగ్గలనిండా సిగ్గులతో పన్నెండేళ్ల అబ్బాయిని-"వెంకటేసూ... తార్ బాపేనే బలాలా..." వాళ్ల భాషలో ఆదేశించింది. వాడు గొరియాను వెంటబెట్టుకొచ్చాడు.

నుదుటి చెమట బిందువుల్ని నెత్తిరుమాలుతో అద్దుకుంటూ..."వచ్చిండ్రా సార్... కూచోండి"- అని మంచం చూపించాడు గొరియా.

"ఆ గుడిసెల వద్దపని చేస్తుంట. చిన్నప్పుడు మా యాదగిరి బాపు నేర్పిన పని ఇప్పుడు అన్నం పెడుతోంది..." చేతులు కట్టుకునుంచున్నాడు.

"నువు గూడా కూర్చో అన్నా"– మా ఇద్దరి మధ్య ఖాళీస్థలం చూపించాడు తాహర్." ఊహు.. మీరు మంచిగ కూర్చోండి..." అంటూ పదేళ్ల అమ్మాయి తెచ్చిన స్టూలు మీద కూచున్నాడు.

"ఇగో... ఇది నా భార్య లచ్చిమి... వాడు కొడుకు.. ఇది కూతురు.." పరిచయం చేశాడు.

"మీరు నా పెనిమిటి దోస్తులట గదా" లక్ష్మి బుగ్గ మీద వేలేసుకుంది. నాయిని సుబ్బారావు వెంకి ఇలాగే ఉండుంటుంది."అవును.. దోస్తులమే"– అంటూ వెంట తెచ్చిన బిస్కట్ పాకెట్లను పిల్లలకిచ్చాడు తాహర్. మామూలు క్షేమసమాచారాలు, ఉబుసుపోని మాటలు... కాళ్లూ చేతులు కడుక్కునే సరికి ఒంటి గంటయింది.

"ముందుగా తినుండ్రి... అటెనక ముచ్చట్లు..." కొంగు సవరించుకుంటూ బయటికొచ్చింది లక్ష్మి. అప్పటికే కడుపులో ఎలుకల పరుగు ప్రారంభమైంది. ఓ నిమిషం అవాక్కయ్యాం. మా ముఖకవళికలను జాగ్రత్తగా చదివేస్తూ...

"ఏం సార్... మా ఇంట్ల తినరా? మీ కోసమే వంట చేయించిన.." గౌరియా మొహం నిరాశకు నిర్వచనంలా మారింది. చేతులు పిసుక్కుంటున్నాడు. కాదంటే బాగుండదు.

"అరెరే.. ఎందుకు తినం?"–తాహర్ ఎదురుప్రశ్నతో భార్యాభర్తల మొహం వెలిగింది." ఇప్పుడు నాకే రోగమూ లేద్సార్.." చేతివేళ్లు చూపించాడు గౌరియా.

"అరెరే.. అదేమి లేదుగాని నువ్వు కూడా మాతో కలిసి తినాలి.." కండిషన్ పెట్టాడు. కడుపునిండా భోంచేశాం. తింటున్నప్పుడు గౌరియాను దగ్గరనుండి చూశాం. ఈ ముఖకవళికలు గల మనిషిని ప్రయాగ కుంభమేళలో చూసినట్టుంది.

మనసుకూ ఓ చూపుంటుంది. అది మనిషిని నియంత్రిస్తుంది. గోరేమియా... గౌరియా ఎలాగయ్యాడు? ఆసక్తిని అణచుకోవడం కష్టమైంది. జంపుకానా పరిచి ముగ్గురూ కూచున్నాం." ఇప్పుడు చెప్పు "నేనే ప్రారంభించాను."అప్పుడు ఇంటి నుండి పారిపోయి ఎక్కడకెళ్లావు, ఎక్కడున్నావు... ఆరోగ్యమెట్లు బాగైంది? అచ్చం నీలెక్క ప్రయాగ కుంభమేళలో ఓ సాధువు కలిసుండు. పేరు గోరఖ్‌నాథ్" అన్నాడు. "కాషాయ వస్త్రాలు, గెడ్డం తీసేస్తే నీకు, అతనికి తేడానే ఉండదనుకో..."

"అవునవును.." గౌరియా గమ్మత్తుగా నవ్వాడు. "పడవలో నీతోనే త్రివేణీ సంగమానికొచ్చి బ్రాహ్మణుణ్ణి మాట్లాడిండు. పిండ ప్రదానం చేయించి దానం అందుకున్నాడు కదా..."

గారడి విద్య చూస్తున్నట్లు విస్తుపోయాను.

"ఆ సాధువును నేనే..." పూర్తిగా నవ్వేశాడు.

నవ్వు నాకెప్పుడూ గొప్పగా కనిపిస్తుంది. కష్టాలను, నష్టాలను, ఆశలను, నిరాశను మింగేసి మండుతున్న వెన్న పూసకు చల్లని వెన్నపూస రాసినట్టు ఆత్మీయానందాన్ని పంచిపెడుతుంది.

"మరైతే" తాహర్ భృకుటి తమాషాగా ముడివడింది. "పోయిన సంవత్సరం అజ్మీరులో ఓ సజ్జాద్... అతడు గూడా నీ లెక్కనే... అచ్చు గుద్దినట్లున్నడు..."

"ఆ సజ్జాద్‌ను నేనే సార్.." కళ్లు తమ్మిరేకుల్లా మెరిసినై.

అమితాశ్చర్యం మా ఆసక్తిని మరింత పొంగించింది.

"అరెరే... నీ సహాయాన్ని మరిచిపోలేము... అన్ని వసతులున్న రూము చూపించినవ్... నమాజు టైముకు తీస్కపోయినవు. తిరిగొచ్చేదాకా మా వెంటనే ఉన్నవ్... నేనిచ్చినంత తీసుకుని సంతృప్తి పడ్డవు. ఆ గడ్డం, షేర్వాని... వారెవ్వా... అక్కడ నీ పేరు గోరేమియానే కదా..."

"అవున్సార్" గోరేమియా మాటల్లో ఆత్మవిశ్వాసముంది. "అజ్మీర్‌ల యాత్రికులకు మంచి సేవలందించి సాయం చెయ్యడమే సజ్జాద్ బాధ్యత గద సార్... ఉదర పోషణార్థం బహుకృత వేషమన్నారు గదా... పాపాలను హరించే ప్రయాగల నా పేరు గోరఖ్‌నాథ్. పెళ్లాం... పిల్లల కోసం మా సమాజం గోరేమియాగా మార్చేసింది."

మా ఆసక్తి ఉప్పెనగా మారింది. "కొంచెం వివరంగా చెప్పన్నా..." అతని కళ్లలోకి సూటిగా చూశాడు తాహెర్.

"చెప్తా సార్...." ముఖకవళికలు గంభీరంగా మారాయి.

"కన్నతల్లి ప్రేమ కడుపునింపకముందే కన్నవాళ్లను పోగొట్టుకుంటి. కడుపునిండా తిండి పెట్టి పెంచిన తల్లిని కుష్ఠురోగం దూరం చేసింది. నా రోగం వాళ్ల పిల్లల కంటుకుంటుందన్న మాట నిజమే గదా. ఇంక అక్కడుంటే ఆదరించే వాళ్లెవరు? ఆ రోజంతా ఏడ్చుకుంట కూచున్నా. అర్ధరాత్రి అమ్మానాన్నల కాళ్లు మొక్కిన. వాళ్లు నిద్రలున్నరు. దేవుని గల్లాపైసలు జేబులపోసుకున్నా. బయటకొచ్చి రోడ్డుమీద నడుస్తున్న. రోడ్డుపక్కనే హాయిగా తలలూపుతున్న చెట్లు... ఈ లోకంలో ఎవరికి వారే ధైర్యం. దిక్కులేనోళ్లకు దేవుడే దిక్కు. భయపడకుమని ధైర్యం చెప్పినై.

తెల్లారేసరికి రామాయంపేట చేరుకున్న. అక్కడ బస్సెక్కి డిచ్‌పల్లిల దిగిన. అక్కడున్న కుష్ఠురోగుల దవాఖానకెళ్లిన. ఆ నర్సులు, డాక్టర్లు మనుషులు కారు దేవుళ్లు. పుచ్చిపోయిందనుకున్న నా శరీరమ్మీది పుండ్లను శుభ్రంగా కడిగి మలాము పూసి, పట్టీలేసి మందులిచ్చిండ్రు. వైద్యం సేసిండ్రు. ఇలా రెండు సంవత్సరాల్లో ఆరోగ్యం బాగైంది. బయటికొచ్చి ఏంజెయ్యాలన్న పరేషాన్ల పడగొట్టింది.

రోజు చెట్టుకింద కూచుని ఆకాశాన్ని చూస్తున్నా. నెత్తిమీది కట్టెలమోపుతో, అద్దాల పావడా రైకతో ముద్దముఖం లచ్చిమి నన్నే చూస్తోంది. "నువ్వెవరు... ఏందీ..." అని దగ్గరకొచ్చి కాళ్లు చూపింది. "రోగం నయమైంది కదా...." మంచి మాటల్తో అడిగింది.

మనుషుల మీద మల్లా నమ్మకం కలగడం మొదలైంది నాకు. వారం రోజుల్లో డిశ్చార్జి చేస్తరంట. అటెన్క ఎటుపోవాలే... ఎట్లా బతకాలే? అనుకుంటూ నా సమస్యను ఆమెకు చెప్తుంటే కండ్లల్ల నీళ్లు తిరిగినై. ముందుకొచ్చి కట్టెల మోపు దించి... "గట్లా ఫికర్ జేస్తే ఏం లాభం? భూమ్మీద చెట్లు, ఆకాశంల పక్షులు బతుకత లేవా?" అని కొన్ని మంచి మాటలు చెప్పి ధైర్యం నూరిపోసింది. అటెన్క... "మేము లంబాడోళ్లము. నాకో కొడుకున్నడు. మొగుడు సచ్చిపోయిండు. అమ్మా అయ్యలు లేరు. మనం పెండ్లిచేసుకుందామా?" ధైర్యంగా అడిగింది. ఆ చూపులు హుషారునిచ్చినయ్.

బతుకుమీది ఆశ బలం పుంజుకుంది.

"తాను దూరే సందు లేదుగాని మెడల డోలు అన్నట్లు నాకే గతిలేదు. మిమ్మల్ని ఎట్ల పోషించాలి?" అని అడిగిన.

"దానికి ఫికరెందుకు? దునియాల మనుషులు రకరకాలుగా బతుకుతున్నరు. నువు వడ్లపని చెయ్... నేను కట్టెలేరుకొస్త. దేవుని జాతర్ల దిరిగి గూడా సంపాయించవచ్చు..." కండ్లు, మూతి హుషారుగ తిప్పుకుంట పూర్తిగా నా ముంగటి కొచ్చింది. కండ్లల్ల కండ్లు కలిపింది. నా బతుక్కో దారి చూపించిన వనదేవతలాగ కన్పించింది.

మర్నాడు ఇద్దరు లంబాడి పెద్దమనుషులతో దవాఖానకొచ్చింది. అందరూ దీవించిండ్రు. మాకు పెండ్లిచేసి నా పేరు గౌరియాగా మార్చేసిండ్రు. ఓ ముసలాయిన ప్రయాగకు అజ్మీర్‌కు దీస్కపోయి అక్కడ కొందరిని పరిచయం చేసిండు. అంతవరకూ తాను చేస్తున్న పని నాకప్పగించి బతుకుదెరువు చూపించిండు. కొన్ని రోజులు ప్రయాగల, కొన్నిరోజులు అజ్మీర్‌ల ఉంటున్న. దేవుని పేర మనుషులకు సాయపడుతూ కొంత దబ్బు సంపాదించుకుంటున్న. మాకో ఆడపిల్ల పుట్టింది. ఆ కొడుకూ, ఈ కూతురుతోని మంచిగనే బతుకుతున్నం..."

అతనిలోని ఆత్మవిశ్వాసం మాకో పాఠం చెప్పింది.

ఎప్పుడొచ్చి కూచుందో లక్ష్మి ఓ చేత్తో కొంగును, మరోచేత్తో నుదుటిని ముద్దాడుకుంటున్న రింగుల ముంగురుల్ని సవరించుకుంటూ.."కానీ నా పెనిమిటి కొక్క కోరిక ఉందన్నా.." అంది.

"అదేమిటి..." అసక్తి కొనమెరుపుజ

"... గా పెంచిన తల్లిదండ్రుల్ని చూస్తడట. వాళ్ల రుణం తీర్చుకోవాలెనని ఆరాటపడ్తున్నడు."

"అంటే మా ఊరికొస్తవా గౌరియా..."

గౌరియాకు శతసహస్ర నమస్కారాలు చెయ్యాలంటోంది నా మనసు. అతని కళ్లలోని మంచుతెరల్ని జాగ్రత్తగా గమనిస్తూ..."యాదగిరి దంపతులు నిన్ను చూసి సంతోసపడ్తరు.." అనేశాను.

"కావచ్చు... కానీ ఏ మొకం పెట్టుకుని రావాలె?" గౌరియా గొంతులో బాధ. అన్నం పెట్టి ఆదరించినోళ్లను అక్కడనే వదిలేసి... ఏమనుకుంటున్నరో ఏమో... వాళ్లు గుర్తుకొస్తే నా కడుపుల చల్ల జేసినట్లైతది..."


"వాళ్లేమనుకోరు గౌరియా. నువు రా... నేను గూడ వస్తా... నువు కూడా తహార్..."

" ఓ పంజెయ్ గౌరియా అన్నా..." తాహార్ సహజధోరణి. "వచ్చేది సెకండ్ సాటర్‌డే... అంటే రెండో శనివారం. మాకు సెలవు. నువ్వారోజు పొద్దున్నే మా ఇంటికి రా. మనిద్దరం కలిసి సిద్దిపేటకు పిల్లింటికి పోదాం. తెల్లారి ఆదివారం. ముగ్గురం కలిసి ఊరికి పోదాం..."

తాహార్ సందర్భోచిత నిర్ణయాన్ని మనసులోనే ప్రశంసించకుండా ఉండలేకపోయాను.

బతుకు పుస్తకంలో ముఖ్యమైన పేజీలు తిరగేసున్నట్లుంది. మనుషుల మనుగడకు గౌరియా జీవన పథం స్ఫూర్తిమంతమనీ, కులమతాలు కూడుబెట్టవనీ, సాటి వాళ్లకు సాయం చెయ్యడంలోనే ఆనందముందనీ మా ఊరివాళ్లకు చెబుతూ గౌరియాను చూపించాలి. స్నేహమాధుర్యాన్ని పంచిపెడుతున్న తాహార్‌తో పాటు నలుగురి మధ్య ఆరోజు హాయిగా గడపాలని ఉవ్విళ్లూరుతున్నాను.

¤ ¤ ¤



(ఆంధ్రదర్శిని వెబ్‌సైట్ పత్రిక
తేది. 11-07-2003)